# పతిభక్తి

కథకులు
కొడవటిగంటి కుటుంబరావుగారు

చిత్రకారులు
శ్రీపాద దుర్గారావుగారు

౧

"ఇందులో నాతప్పేమెంతో ఆలోచించి చెప్పండి. నిష్కారణంగా ఈ అపవాదుపడ్డం. నాకింతమాత్రం ఇష్టంలేదు. మొన్న మాచుట్టాలుంటుంటు మా మరదలన్నదా లేదా?...మా అక్కయ్య నీకు చాలబడి చేస్తున్నదిట, ఏమిటని. మొగుడూ పెళ్లాలమధ్య లక్షగ్రంథం నడుస్తుందిగాక. అదంతా లోకం సార్థమయిపోయి ఈవిధంగా నన్ను బాధించడమనేదున్నదే, చాలా శోచనీయమే కాకుండా లజ్జాకరమైన ఏడవాలిసిన సంగతి. నే నంతకన్న ఇక్కడ చెప్పలేను."

నిజమే! నాకు ఆడవాళ్ళు భర్తలయందు భయభక్తులూ, వినయవిధేయతలూ కలిగి దాసానుదాసులై ఉంటే చూడాలని ఉంటుంది. అంతమాత్రంచేత నేను నన్ను పసిపిల్ల బాలాదిపర్యంతం స్త్రీ రాసుపత్రికి పోతున్నవాణ్ణి చూసినట్టు చూడక్కర్లేదు. నాకూ ఈకాలపుపద్ధతులు నచ్చకపోలేదు. క్రాపింగులు పెట్టుకోండి, మైలగుడ్డలతో భోజనంచెయ్యండి, శూద్రవాళ్ళతో కలిసి ఒకబంతినే భోజనాలు ఆరగించండి. నే నడగను. ఎట్లాగో కలికాలం ఈవిధంగా జరిగించే ఉందిట. కాని ఆడవాళ్ళకు స్వేచ్ఛఇచ్చి కులకమనటానికి నా అంతరాత్మను నిలువునా చీల్చినా ఒప్పదు. వాళ్లను ఖైదీలకిందఉంచి ఒక కాలితో ఒత్తిపట్టక పోతే—అమ్మో! స్త్రీబుద్ధిః ప్రళయాంతకహ అన్నవాడు పిచ్చివాడా?

నాకింతమాత్రం ఆలోచనే ఉండుంటే పెళ్ళి చేసుకోకనేపోదును. కాని నాపెళ్లి నాకు చాలా చిన్నతనంలోనే అయిపోయింది. ఏంచెయ్యను? ఆభగవంతుడు నాయందు ఇంకనూ దయఉంచలేదు. నాభార్యకు ఇతరస్త్రీలందరికీ ఉన్న దుర్గుణాలన్నీ ఉన్నై. ఒకటి నవ్వటం. పురాణాల్లో పతివ్రతలను తీసుకోండి. వాళ్లెక్కడైనా నవ్వినట్టు నిదర్శనం ఉందేమో చూడండి. ఎందుకంటుంది? ఆడది నవ్వితే నాకంతా ఇంతా మంటకాదు. చక్కగా, గంభీరంగా ఉండలేరూ? అసలు నవ్వే నాలుగందాల చెరుపని ఊరికే అన్నారా ఏమిటి? రెండోదుర్గుణం అతిగా మాట్లాడటం. పతివ్రతకు—అనగా సర్వకాల సర్వావస్థలయందూ మొగుడిసంగతి విచారించేదానికి—అంత మాట్లాడటానికి అవకాశం ఎక్కడుంటుంది! ఒకళ్ళతో ఒకళ్ళు ఎక్కువగా మాట్లాడుకోటం ఒకటి. మగవాళ్ళతో మాటకుమాట సమాధానంచెప్పటం ఒకటి. ఇటువంటి దుర్గుణాలు సామాన్యంగా ఆడవాళ్ళందరికీ ఉన్నై. నాదురదృష్టంచేత అన్నీ నాభార్యకూ అబ్బినై. ఏచింతా ఎరగని నాజన్మకిదో పెద్ద మనోవ్యాధి అయిపోయింది.

ఇవన్నీ బహిరంగంగా చెప్పవలసినవి కావు కాని ఉన్నసందర్భమంతా పూసగుచ్చినట్టు చెప్పకపోతే నావల్ల నేరం ఉన్నదీ లేందీ మీ కెట్లా తెలుస్తుంది?

నాపెళ్లాం అందరాడవాళ్ళల్లే ఉండటమే కాకుండా వాళ్ళు వాళ్ళమొగుళ్ళను చూస్తున్నదానికన్న నన్ను చాలాచులకనగా చూసేది. నన్నన్నీ అసందర్భమైన ప్రశ్నలు వేసేది. త్వరగా వంటకానివే అంటే మిమ్మల్ని నెవకనించి అట్లా తరుముతుంటే మీరాఫీసులో ఎన్నాళ్లు పనిచెయ్యగలరు? ప్రతిరోజూ మీచేత అట్లా అనిపించుకోవాలంటే చూడండి ప్రాణంఎట్లా ఉంటుందో అంటుంది. కావాలని ఎన్నిసంవత్సరాలైనా వంటచెయ్యొచ్చుగాని వంటచెయ్యకతప్పదు, విధి, అనుకుంటూ ఒక్కరోజుకూడా చెయ్యలేనుస్మా అంటుంది.

"ఏమండోయ్! ఇవాళ పొద్దున మీరిట్లాఆఫీసుకు పోగానే మీబావగారొచ్చారు." (మామేనత్తకొడుకన్నమాట!)

"ఊఁ!"

"'వాడున్నాడా?' అన్నారు."

"నన్ను నువ్వు 'వాడు' అనవచ్చునా?"—నేను.

నాపెళ్లాం ముక్కుమీద వేలుపెట్టుకుని, "రామ! రామ! నేను మిమ్మల్ని వాడన్నాననటండీ?"

"వాడున్నాడా అన్నాడంటివే?"

"అవును. ఆయనమాటలే అవి."

"అట్లా అనగూడదు."

"వారున్నారా అన్నారనాలా?"

నాకీపాటి కల్లా చిరాకువచ్చి నోరుమూసుకోమంటాను. నేను మాటాడలేక తిడుతున్నానంటుంది. మాటకుమాట చెప్పటం అసహ్యమైకాని ఇంతమాత్రానికే మాట్లాడలేక పోతామా? ఇదీ వరస.

పువ్వుపుట్టంగానే పరిమళిస్తుందిట. కాపరానికి వచ్చినరోజు లగాయతు దానిబుద్ధి ఎప్పుడు ఒక్కదిక్కుకే ఈడుస్తుంటే! తల్లో పిన్నులుకావాలి. పౌడర్లుకావాలి. మాసపత్రికలు కావాలి. ఒక్కటికూడా ఇచ్చావని కల్లోకూడా అనుకోకండి. నాఉద్దేశం తెలీకుండా మొగుడనైనా విచారించకుండా పైకు డబ్బు ఖర్చవుతుందని భయంఅనటం పతివ్రతలక్షణమేనా?

దీన్ని ఏమిటిచెయ్యటం అని చాలా దిగులుకలిగింది నాకు. బాగా యోచించినమీదట నాకొక్కటే ఉపాయం కనపడ్డది. ప్రతిరోజూ దానికి పతివ్రతల కథలు చదివి వినిపించటం మొదలుపెట్టాను. నేనిప్పుడో మహాపతివ్రతలకథలని ఒకపుస్తకం కొన్నాను అది ఇప్పు డక్కరకొచ్చింది. తరవాత రామాయణం చదివాను.

ఒకరోజున నాభార్యకు పెద్దసందేహంవచ్చింది.

"ఏమండీ సీత మంచిపతివ్రతేనా!"

"అమ్మా! లోకంలో ముగ్గురు పతివ్రతల్లో ఒకత్తే."

"ఎవ రెవరండి?"

"అహల్యా ద్రౌపతీ సీతా—వీళ్లు ముగ్గురూ."

"అహల్యంటే ఇంద్రుడితో—?"

"అట్లాఅంటే కళ్లురొంపూ పోతై."

"ద్రౌపతి పంచపాండవుల పెళ్లాంకదా?"

"అబ్బో నీపాతివ్రత్యానికి వీళ్ల నెక్కించవచ్చావే! సీత కేం వంక పెట్లావు?"

"అంతావంకే! అంతకన్న నేనే మంచిపతివ్రతను."

"ఎందువల్లో!"

"ఎందువల్లకాదో! ముందుసంగతసలు సీత రాముణ్ణి నువ్వంటుందేం? ఏమిరాఅనికూడా అన్నది."

ఈవాదన కేంచెప్పను! అప్పటిమట్టుకు కొంపడి నోరుమూశాను. మర్నాడు మళ్లీ ఈసంగతే ఎత్తింది మాఇంటిది. ఆలోచించగా నాకే అంత బాగాలేదు సీత రాముణ్ణి గౌరవంగా పిలవకపోవటం. తరవాత నేను బాగా తెలిసిన పెద్దమనిషి నడిగా నీవిషయం. ఆయన చెప్పిందంతా అర్థంకాలేదు కాని ఉన్నసందర్భం ఇంచుమించు ఇది. సీతారాములూ వాళ్లూ వాడిన భాష తెలుగు కాదుట. అదిసంస్కృతం అన్నాడాయన. ఎందుచల్లంటే అది దేవభాష. కనక భగవంతుడి అవతారాల్లో అదే ఉపయోగించబడ్డదన్నాడు. తదుపరి సంస్కృతవ్యాకరణం మన తెలుగువ్యాకరణమల్లేకాక గొంతుపట్టేస్తుందిట. దానిప్రకారం ఎదురుగా ఒక్కమనిషి ఉన్నప్పుడు ఆమనిషి దేవుడయ్యేది రాజయ్యేది ఏకవచనం ప్రయోగించాలిసిందేట. కనీసం ముగ్గురన్నా ఎదురుగాలేంది బహువచనంమాట తలపెట్టగూడదుట. అందుచేత సీత సంస్కృతంలో రాముణ్ణి ఏకవచనంలోనే సంబోధించింది తెలుగులో తర్జుమా చేసిన పెద్దమనుష్యులు ఆ ఏకవచనం ఏకవచనంగానే ఉంచారట ఇదంతా నాపెళ్లానికి చెప్పినమీదట ఎవరినో అడిగి కనుక్కున్నానన్నది. తనకు కావలసింది ఏకవచనమా, నేను కనుక్కోటమా?

అయితేఏం? రాపాడగా రాపాడగా రాళ్లైన అరుగుతై. క్రమంగా నాపెళ్లానికి పాతివ్రత్యాన్ని చూస్తే గౌరవం ప్రారంభించింది. నన్ను పతివ్రతలక్షణాలు, పతివ్రతామహాత్మ్యం వీటినిగురించి అడగటం మొ

దలుపెట్టింది. చావుకు పెడితే లంఖణాలకు రాకపోతుందా అని నాబుద్ధికి తోచినవన్నీ చెప్పాను.

౨

అదే మొదలనుకోండి నాకష్టాలకూ, అపఖ్యాతికీ.

పాతివ్రత్యాన్నిగురించి నా అభిప్రాయం వలుసంతైనా మార్చుకోకన్న—నే నంత తేలిగ్గా అభిప్రాయాలు మార్చుకునేవాణ్ణికాను—కాని ఈ పాతివ్రత్యాన్ని శాస్త్రోక్తంగా ఆచరణలో పెట్టాలంటే కొంత ఇబ్బంది కలక్కపోదు.

ఒకరోజు ఉదయం నేను నిద్రలేచి పక్క మీదినించి లేవబోతూండగా నాపెళ్లాంవచ్చి నన్ను లేచినుంచోమని వంగి కాళ్ళంటుకుని కళ్లకద్దుకుంది. ఈచర్య నాకు వెంటనే అర్థంకాలేదు. చప్పున నాకు పిచ్చా అసహ్యమూ కలిగి ఏమిటీకోలాహలం అనబోతుండగా జ్ఞాపకంవచ్చింది! ఆరోజు కంతటితో పోయింది. ప్రతిరోజూ ఈ విధంగానే చేస్తుందాఏమిట్రా భగవంతుడా అని భయంవేసింది. కాని మరిచిపోకపోతుందా అనుకున్నాను. మరిచిపోయింది నేను. మర్నాడు మళ్లీ ఈప్రకారమే జరిగింది. ఆమర్నాడు. ఆమర్నాడు. ఆపని పోనీ చెయ్యకపోతే ఏమందామని నోటిదాకావచ్చింది. కాని ఎట్లాఅనను? నేను చదివినకథలన్నీ ఇందుకేగా? ఈనమస్కారాలుచేయించుకోటం కాకపోయినా నా ప్రాణానికొచ్చింది.



ఒకరోజు జ్ఞాపకంపెట్టుకుని అది లేవకముందే లేచి బయటికివెళ్లి ఎనిమిదింటికొచ్చాను. అట్లాతప్పుతుందా? నేను కనబడగానే నన్ను నిలవబెట్టి నాపాదాలు కళ్ళకద్దుకుంది. మర్నాడుకూడా చీకటితోనే లేచిపోయి అది మడిగట్టుకున్న తరవాత వచ్చాను. కాని తప్పలేదు. మళ్లీ మడిగట్టుకుంటానన్నది. ఆఫీసుకు శలవరోజుగా చూసి ఒంటిగంట కింటికి వచ్చినా తప్పలేదు. ఇల్లు వదిలి దేశంమీదలేచి పోయేవాళ్ళ భార్యలందరూ చెడ్డవాళ్ళని చెప్పలేం!

ఇంకో తమాషాకూడా జరిగింది. తెల్లవారుగట్ల గదిలో నమస్కారాలుచేయించుకుంటే ఎవరికీ తెలీదేమోకాని కొంతపొద్దెక్కిన తరవాత ఆరు బయట చేయించుకున్నారో, లోకమంతా తెలిసిందే! మీభార్య ఇతరులుచూసి ఏమనుకున్నా లెక్కచెయ్యని పతివ్రత అయితే అడగక్కర్లేదు.

దీనితోనే నాకు దాన్నిచూస్తే హడలయిపోతే, ఇది చాలక పూర్వం చేసుకునే పోరులన్నీమానేసి జుట్టు గోళ్ళతోనే దువ్వి కొప్పుపెట్టుకుంది,

పెద్దకుంకంబొట్టు పెట్టింది, నీరుకాయ చీరలు కాశా పోసి కట్టి భీకరాకారందాల్చింది. రామరామ! మనిషిలో ఒక్కరవ్వయినా ఆకర్షణలేకుండాపోయింది. ఉక్కిన పేనల్లే ఉండవలిసిందేకాని ఉలకటానికీ పలకటానికీ వీలులేదు. అక్కడికీ మనసుపట్టలేక ఈ అవతారం లోనే అందంగా ఉండకూడదా అంటే, నవ్వి, “ఏంపిచ్చండీ మీకు? అందంగా ఉండాలంటే పోషణ చేసుకోవాలా ఏమిటి?” అంది అంతటితో నానోరుకట్టు.

కొద్దికాలమయిన తరవాత నా భార్య నే నుత్త నమస్కారాలతో తృప్తిపడటంలేదనేమో, పూజానమస్కారాలు ప్రారంభించింది. ఉదయం నేను లేవగానే పూలతో తయారు. అవి నాకాళ్ళమీద పూజచెయ్యటం, ఆపూలు కొప్పులో పెట్టుకోటం.

“పూలన్నీ నాకే పూజచేస్తే దేముడికో?” అన్నా నొకనాడు.

“దేముడికి పూజెందుకు? నేను దేముడిపూజ మానేశాను.”

నాగుండె ఝల్లుమంది. తరతరాలనించీ వస్తున్న దేముడిపూజ ఇప్పుడు మానేస్తే నెత్తి అదుస్తుంది!

పై మాసపు సంచికలో

‘పతిభక్తి’ యను ఈకథను వ్రాసిన

శ్రీయుత కొడవటిగంటి కుటుంబరావుగారి

## బొమ్మల పెళ్ళిళ్లు

అను కథ ప్రచురింపబడును. ఆకథ బోధించు సత్యమిది:

“తన పెళ్ళినిగురించి మాట్లాడటానికి సిగ్గుపడని పిల్ల ఉండదు. ఒకవేళ మాట్లాడిందా ఆసంబంధం తనకు ఇష్టంలేదన్నమాట. ఇష్టంఉంటే ఆసంబంధం అవుతుందని నమ్మకం ఏమీలేదన్నమాట.

స్త్రీ ఇంకొకరి రహస్యాలు భద్రంగా దాచలేకపోయినా తనరహస్యాలుసంబంధించినంతవరకూ ఇనపపెట్టె.

మగవాడు ఒక్కసారి మందరంనించి తారానికి పోగలడు.

మగవాడు తనయిష్టంవచ్చినపిల్లను పెళ్ళిచేసుకోటానికి నీతి, మతం, సంఘం - వీటినిగురించి తనకున్న అభిప్రాయాలన్నీ మార్చుకోగలడు”

“ఎంత కురూపం చేశావు?” అన్నాను గదమాయించి.

అది మహాభినయంతో “క్షమించండి, నాకా దేముడితో పనిలేదు. నాకాకాలింగాల్లో ఇత్తడిబొమ్మల్లో నమ్మకంపోయింది. జ్యోతిల్లే మీరు సాక్షాత్తూ నాకళ్ళక్కనపడుతుంటే—”

“నివేదనైనా చేస్తున్నావా?”

“లేదు.”

నాకు తక్షణం ఏక్కడికైనాపోయి ఎక్కెక్కి ఏడవాలనిపించింది.

దాన్నికోప్పడి ఏమీలాభంలేదు. ఇప్పుడీధోరణిమారి ఇంకొకటి తోవలో పడితే నన్ను గడ్డిపరకకింద చూడదు. నేను పన్యసించవలిసినవాక్యం? దేవతాభ్రమనచూసినప్పుడల్లా గుండెబద్దలవుతున్నది. ఎంతకాలంనేను ఈఆశ్చర్యం ఓరుస్తాను? దానికేం? దాని పాతివ్రత్యం దాన్ని రక్షిస్తుంది. దెబ్బపడేది నా నెత్తిన.

ఈదుస్థితిలో ఒకనాడు నా పెళ్ళాం నాతో అపూర్వమంటిమాట ఒకటి అన్నది.

“ఏమండీ, ఇంట్లో పూజాపునస్కారాలులేకపోవటం నాకు బాగాలేదు.”

“అద్భుతమైనమాట అన్నావు. నీబుద్ధి ఇంతమంచి



ఆలోచన ఈమధ్య ఎన్న డూవచ్చినట్టు నాకు గుర్తు లేదు! దేవశాస్త్రవకు మాయా లుప్రకారం పూజానివేదనలు చెయ్యి."

అది నాకు వశ్యమండేట ట్టు తలఅడ్డంగా ఊపి "అది కాదు. ప్రతిరోజూ నీకే పూజచేస్తాను," అన్నది.

నాపెంట్రుకలు ఒక్కసారి నిక్కపొడుచుకున్నై, భ యంతో శరీరం యావత్తూ కంపరమెత్తింది. ఎట్లా వద్ద నను ?

నాచేత స్నానంచేయిం చింది. మా అత్తవారిచ్చిన బరంపురం పట్టుతాపితాలు త డిపిఎండేసి అవి నాచేత కట్టిం చింది. ఒకపీటమీద పసుపు రాచి ముగ్గుపెట్టి దానిమీద కూర్చోమంది. పట్టుబట్టలు చెడిపోగాలంటే వెంకపట్టు బట్టలు పోతేపోయినయ్యం ది కూర్చున్నాను. నెత్తినిం డా పూలు అక్షింతలూ వే సింది నీళ్ళుచిలకరించింది. బట్టలన్నీ ధ్వంసమయినై, నేను సగంపైగా చచ్చిఉన్నాను.

ఈసమయంలో "దొడ్డమ్మా" అంటూ వచ్చాడు పక్షిపోయినట్టు మామరదలికొడుకు నాపాలిటి యమ కింకరుడల్లే !

ఇంకా ఈవిధంగా జరుగుతునేఉంది. కాని నేను తగిన మనోబలంతెచ్చుకుని త్వరలో ఇది అంతమయ్యే టట్టు చేస్తాను. నన్ను కుక్కనుచూచినట్టు చూస్తే చూసింది, నాపెళ్లాం మళ్లీ నాదగ్గిరికి వాలుజడేసుకుని చక్కని చీరకట్టుకుని మైసూరు గంధం సబ్బువాసనా, ఫేసు పౌడరు వాసనా కొట్టుతూ వస్తుందా అని అను కున్నప్పుడల్లా గుండె నీరవుతున్నది.

